రిపోర్టర్లు కావలెను

తొలి సమయం

తెలుగులో రాయగల సమర్థత, సమాజం పట్ల అవగాహన ఉంటే చాలు.

తెలుగు రాష్ట్రాలలో సంచలనాలు సృష్టిస్తున్న 'తొలి సమయం' మీకు సరైన వేదిక.. అన్ని జిల్లాల, మండలాల మరియు నియోజకవర్గాల పరిధిలో పనిచేసేందుకు అవకాశం కల్పింస్తోంది. రిపోర్టర్లు కావాలి.

ఇంకెందుకు ఆలస్యం...

9000689544, 7569944360 నంబర్లకు వాట్సాప్‌లో మీ బయోడేటాను పంపండి.



దిన పత్రిక

# తొలి సమయం

వాస్తవమే గమ్యం! గమనం!!

సంపుటి : 02 సంచిక : 307 మంగళవారం 25-11-2025 ఎడిటర్ వేముల అయోధ్య రాములు పేజీలు : 6 వెల : 5/-


## భారత్ అమ్ములపొదిలో 'నిశ్శబ్ద వేటగాడు'


2లో



## పుచ్చ లేచిపోద్ది: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్

- నిరంజన్ రెడ్డికి మూడు ఫామ్‌హౌస్‌లు ఉన్నాయని కవిత ఆరోపణ
- ఆయన అవినీతి కేసీఆర్‌కు తెలియదా అని సూటి ప్రశ్న
- హరీశ్ వల్లే నిరంజన్‌పై కాంగ్రెస్ చర్యలు తీసుకోవట్లేదన్న కవిత





## 'సింధ్ మళ్లీ భారత్‌లో కలవొచ్చు'- రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు

2

- పాకిస్థాన్‌లోని సింధు ప్రావిన్స్‌పై రాజనాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు
- భారత్ నుంచి సింధును వేరుచేయడాన్ని బీజేపీ అంగీకరించలేదని వెల్లడి

భారత్-పాకిస్థాన్ సరిహద్దుపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దులు ఎప్పుడైనా మారవచ్చని, రేపు సింధ్ ప్రాంతం భారత్‌లో తిరిగి చేరుతుందేమో ఎవరికి తెలుసని వ్యాఖ్యానించారు. ఆదివారం దిల్లీలో జరిగిన 'సింధీ సమాజ్ సమ్మేళన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఉపప్రధాని లాల్ కృష్ణ అడ్వాణీ చెప్పిన మాటలను కోట్ ఉటంకించారు. "ఇది అడ్వాణీ చెప్పిన మాట. ఈ రోజు సింధ్ ప్రాంతం భారత్‌లో భాగం కాకపోవచ్చు. కానీ నాగరికత పరంగా చూస్తే, సింధ్ ఎప్పుడూ భారత్‌లోనే అంతర్భాగంగా ఉంటుంది. భూమి విషయానికొస్తే సరిహద్దులు ఎప్పుడైనా మారవచ్చు. రేపు సింధ్ మళ్లీ భారత్‌లో చేరుతుందేమో ఎవరికి తెలుసు."

- రాజ్‌నాథ్ సింగ్, భారత రక్షణ మంత్రి



# 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్

– సీఎం రేవంత్ రెడ్డి

- వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌ను పరిశీలించిన సీఎం
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొడంగల్‌లో ఏ విద్యార్థీ ఆకలితో ఉండకూడదన్న లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో 28 వేల మందికి ఉదయం అల్పాహారం (బ్రేక్‌ఫాస్ట్) అందిస్తున్నామని వెల్లడించారు. దీంతో ప్రభుత్వ బడుల్లో 5 వేల మంది విద్యార్థులు పెరిగారని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అక్కడి 'అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్'ను పరిశీలించారు. మధ్యాహ్న భోజన కిచెన్ భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు.

**ఎడ్యుకేషన్ హబ్‌గా కొడంగల్ :** జీవితాల్లో మార్పు రావాలంటే పిల్లల్ని చదివించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కొడంగల్‌లో రూ.5 వేల కోట్లతో ఎడ్యుకేషన్ క్యాంపస్ నిర్మిస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో తొలి సైనిక్ స్కూల్‌ను ఇక్కడే ఏర్పాటు చేయబోతున్నామని వివరించారు. 16 నెలల్లోగా కొడంగల్‌ను అంతర్జాతీయ ఎడ్యుకేషన్ హబ్‌గా తయారు చేస్తామని రేవంత్ రెడ్డి వివరించారు. రాబోయే కొన్ని నెలల్లో నియోజకవర్గంలో రైల్వే పనులు ప్రారంభమవుతాయన్నారు. దేశానికే కొడంగల్‌ను ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేస్తామన్నారు. మహిళలు ఆత్మగౌరవంతో బతికేందుకు కృషి చేస్తున్నామన్న రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని పునరుద్ఘాటించారు. వెయ్యి ఆర్టీసీ బస్సులకు వారిని యజమానులుగా చేశామన్నారు. సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులకు కూడా యజమానులను చేశామని చెప్పారు. అదానీ, అంబానీలతో పోటీపడేలా వారిని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులు అమెజాన్‌లో అమ్ముకునేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. కొడంగల్‌లో రూ.103 కోట్లతో అభివృద్ధి పనులకు రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

**తెలంగాణ నోయిడాగా కొడంగల్ :** మూడు నెలల్లో కొడంగల్‌లోని ప్రతి గ్రామానికి కృష్ణా నీళ్లు అందిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. లగచర్ల పారిశ్రామికవాడకు అంతర్జాతీయస్థాయి గుర్తింపు తీసుకొస్తామని వెల్లడించారు. తెలంగాణ నోయిడాగా కొడంగల్ నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతామన్నారు. రాబోయే కొన్ని నెలల్లో కొడంగల్ రైల్వే పనులు ప్రారంభమవుతాయన్న ఆయన నియోజకవర్గంలో సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. త్వరలో సర్పంచ్ ఎన్నికలు రాబోతున్నాయని రేవంత్ రెడ్డి వివరించారు.

మరో 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు

మిగతా 2లో



## తమిళనాడు, ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదాలు

- 12 మంది మృతి

**తమిళనాడు :** తమిళనాడు రెండు ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఏడుగురు మృతి- 30 మందికి పైగా గాయాలు- ఉత్తరాఖండ్‌లో నియంత్రణ కోల్పోయి గుంతలో పడ్డ బస్సు- ఐదురుగు మృతి, 20 మందికి గాయాలు : తమిళనాడులోని తెన్‌కాశి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు ప్రైవేట్ బస్సులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా, 30 మందికి పైగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యల్లో చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మధురై నుంచి సెన్‌కొట్టాయ్ వెళ్తున్న ఓ ప్రైవేటు బస్సు దురైసామిపురం ప్రాంతానికి రాగానే, ఎదురుగా తెన్‌కాశీ నుంచి వస్తోన్న మరో బస్సును బలంగా

మిగతా 2లో

## ఆయుధాలు వదిలేస్తాం - మాకు అప్పటి వరకు సమయమివ్వండి : మావోయిస్టుల లేఖ



కూంబింగ్ ఆపివేస్తే సాయుధ పోరాటం విరమిస్తామంటూ మావోయిస్టుల పేరుతో లేఖ - మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు తమకు సమయం ఇవ్వాలని మావోయిస్టులు అభ్యర్థిస్తున్నట్లు లేఖ ఆయుధాలను వీడటంపై మావోయిస్టులు కీలక ప్రకటన చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్ నిలిపివేస్తే ఆయుధాలను వదిలే తేదీని ప్రకటిస్తామని

మిగతా 2లో

## రాజకీయ పార్టీలకు 'క్యాష్ డొనేషన్స్'పై పిటిషన్- కేంద్రం, ఈసీకి నోటీసు జారీ చేసిన సుప్రీంకోర్టు




- రాజకీయ పార్టీలకు నగదు విరాళాలపై సుప్రీంకోర్టులో పిటిషన్
- కాంగ్రెస్, బీజేపీలకు నోటీసులు జారీ చేసిన సుప్రీంకోర్టు

**ఢిల్లీ :** సుప్రీంకోర్టు సోమవారం కేంద్రం, ఎలక్షన్ కమిషన్ సహా పలు రాజకీయ పార్టీలకు నోటీసులు జారీ చేసింది. రాజకీయ పార్టీలు రూ.2వేల కంటే తక్కువ మొత్తంలోని నగదు విరాళాలను లెక్కాపత్రం లేకుండా స్వీకరించడానికి అనుమతించే ఐటీ చట్టంలోని నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రతిస్పందించాలని కోరింది. రాజకీయ పార్టీలకు ఇచ్చే విరాళాల విషయంలో పారదర్శకత

మిగతా 2లో

## 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం

- ప్రధాని, విదేశీ ప్రతినిధులు హాజరు



2



2

## అయోధ్య రామమందిర నిర్మాణం సంపూర్ణం- ధ్వజారోహణానికి అంతా సిద్ధం!

కాషాయ ధ్వజాన్ని ఎగరవేయనున్న ప్రధాని నరేంద్ర మోదీ

## బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

2



# భారత్ అమ్ములపొదిలో 'నిశ్శబ్ద వేటగాడు'

- ◆ భారత నౌకాదళంలోకి చేరిన కొత్త తరం యుద్ధ నౌక ఐఎన్ఎస్ మాహె
- ◆ జలాంతర్గాములను వేటాడటమే దీని ప్రధాన లక్ష్యం
- ◆ 80 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మాణం
- ◆ లోతు తక్కువ నీటిలోనూ పనిచేయగల ప్రత్యేక సామర్థ్యం
- ◆ ఈ తరహాలో రానున్న 8 నౌకల్లో ఇది మొదటిది

భారత నౌకాదళం తన అమ్ములపొదిలో మరో శక్తిమంతమైన ఆయుధాన్ని చేర్చుకుంది. తీర ప్రాంతాల్లో శత్రు జలాంతర్గాములను గుర్తించి, వాటిని ధ్వంసం చేయడమే లక్ష్యంగా రూపొందించిన 'మాహె' శ్రేణిలోని తొలి యుద్ధ నౌక ఐఎన్ఎస్ మాహెను నేడు లాంఛనంగా ప్రారంభించింది. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ యాంటీ-సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో-వాటర్ క్రాఫ్ట్ రాకతో భారత తీర రక్షణ సామర్థ్యం, జలాంతర్గాములను వేటాడే శక్తి గణనీయంగా పెరగనుంది. దీనిని దేశీయంగా నిర్మించిన సరికొత్త తరం తీరప్రాంత యుద్ధ నౌకగా నేవీ అభివర్ణించింది.

ఈ యుద్ధ నౌక నిర్మాణం 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తికి నిలువుటద్దం పడుతోంది. ఇందులో 80 శాతానికి పైగా స్వదేశీ పరికరాలు, సాంకేతికతను వినియోగించారు. కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (సీఎస్ఎల్) నిర్మించింది. ఈ ప్రాజెక్టు.. నౌకా నిర్మాణ రంగంలో భారత్ సాధించిన ప్రగతికి, వ్యవస్థల అనుసంధానంలో మనకున్న నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. తీరానికి సమీపంలో ఉండే జలాల్లో వేగంగా, శత్రువుల కంటపడకుండా, అత్యంత కచ్చితత్వంతో కార్యకలాపాలు నిర్వహించేలా దీనిని ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఐఎన్ఎస్ మాహెను ప్రధానంగా తీర ప్రాంతాల్లోని లోతు తక్కువ నీటిలో ఆపరేషన్ల కోసం రూపొందించారు.

పెద్ద యుద్ధ నౌకలు వెళ్లలేని ఇరుకైన జలాల్లో ఇది సులువుగా కదలగలదు. యాంటీ-సబ్‌మెరైన్ ఆపరేషన్లతో పాటు, తీరప్రాంత గస్తీ, సముద్ర గర్భంలో మైన్లను అమర్చడం, నీటి అడుగున నిఘా వంటి కీలక బాధ్యతలను ఇది సమర్థంగా నిర్వర్తిస్తుంది. దీని పొడవు 78 మీటర్లు కాగా, సుమారు 1,100 టన్నుల బరువును మోయగలదు. గంటకు 25 నాట్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించే ఈ నౌక, ఒకసారి ఇంధనం నింపుకుంటే 1,800 నాటికల్ మైళ్ల దూరం ప్రయాణించి, 14 రోజుల పాటు నిరంతరాయంగా విధుల్లో పాల్గొనగలదు. దాదాపు నిశ్శబ్దంగా ప్రయాణించే దీన్ని 'సైలెంట్ హంటర్' గా పిలుస్తారు.

ఈ నౌకలో అత్యాధునిక స్వదేశీ ఆయుధ వ్యవస్థలను అమర్చారు. ఇంటిగ్రేటెడ్ కంబాట్ మేనేజ్‌మెంట్ సూట్, డీజిల్ ప్రొపల్షన్, అడ్వాన్స్‌డ్ పవర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, మీడియం-ఫ్రీక్వెన్సీ సోనార్, మల్టీ-ఫంక్షన్ సర్వైలెన్స్ రాడార్ వంటివి ఇందులో ఉన్నాయి. తేలికపాటి టార్పెడోలు, మల్టీ-రోల్ రాకెట్ లాంచర్లు, స్వీయ రక్షణ కోసం రిమోట్ కంట్రోల్డ్ 30 ఎంఎం గన్‌తో పాటు, మైన్లను అమర్చేందుకు ప్రత్యేక రైళ్లను కూడా అమర్చారు.

మలబార్ తీరంలోని చారిత్రక పట్టణమైన మాహె పేరును ఈ నౌకకు పెట్టారు. దీని చిహ్నంపై కలరిపయట్టు యుద్ధ విద్యలో ఉపయోగించే 'ఉరుమి' అనే వంగే కత్తి చిత్రాన్ని ముద్రించారు. ఇది చురుకుదనాన్ని, కచ్చితత్వాన్ని, ప్రాణాంతకమైన సామర్థ్యాన్ని సూచిస్తుంది. ఈ నౌక లక్షణాలు కూడా అవేనని నేవీ అధికారులు తెలిపారు.

కొచ్చిన్ షిప్‌యార్డ్ నుంచి నౌకాదళం ఆర్డర్ చేసిన ఎనిమిది నౌకల్లో ఇది మొదటిది. మిగిలిన ఏడు నౌకలు 2027 నాటికి నేవీలో చేరనున్నాయి. ఈ శ్రేణి నౌకలు పూర్తిస్థాయిలో విధుల్లోకి చేరాక, పాతబడిన అభయ్-క్లాస్ కార్వెట్ల స్థానాన్ని భర్తీ చేస్తాయి. తద్వారా హిందూ మహాసముద్ర ప్రాంతంలో, వ్యూహాత్మక తీర మండలాల్లో పనిచేసే శత్రు జలాంతర్గాములను గుర్తించి, నాశనం చేసే భారత సామర్థ్యం మరింత బలోపేతం కానుంది.

# 'సింధ్ మళ్లీ భారత్‌లో కలవొచ్చు'- రాజ్‌నాథ్ కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ :** వాస్తవానికి సింధ్ ప్రాంతాన్ని సింధీ ప్రజల మాతృభూమిగా పేర్కొంటారు. సింధూ లోయ నాగరికతకు ఇది ప్రధాన కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. 1947 భారతదేశ విభజనతో ఈ ప్రాంతం పాకిస్థాన్‌లో భాగమైంది.

**సింధు నది పరమ పవిత్రం**

భారత నాగరికతలో సింధ్ ప్రాంతానికి ఉన్న సాంస్కృతిక ప్రాధాన్యతను రాజ్‌నాథ్ సింగ్ గుర్తు చేశారు. సింధ్‌లోని చాలా మంది ముస్లింలు సింధూ నది నీటిని పవిత్రంగా చూస్తారని అన్నారు. ముస్లింలు మక్కాలోని ఆబ్-ఎ-జమ్జమ్ కంటే సింధు నది నీరు తక్కువ పవిత్రమైనదిగా భావించరని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. 'అద్వానీ తన పుస్తకంలో సింధీ హిందువులు, ముఖ్యంగా తన తరం వారు, సింధ్ ప్రాంతం భారత్ నుంచి విడిపోవడాన్ని ఇప్పటికీ అంగీకరించలేదని రాశారు' ఆయన రాజ్‌నాథ్ గుర్తుచేశారు. "సింధూ నదిని పవిత్రంగా భావించే మన సింధ్ ప్రజలు ఎప్పుడూ మనవారే. వారు ఎక్కడ ఉన్నా, వారు ఎప్పుడూ మనకు చెందినవారే" అని ఆయన ఉద్వేగంగా అన్నారు.

**పీవోకే ప్రజలూ మనవాళ్లే**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) ప్రజలూ మనవాళ్లేనని, అక్కడున్న వారికి భారత్‌తో దృఢమైన సంబంధాలు ఉన్నాయని గతంలో రాజ్‌నాథ్ సింగ్ అన్న సంగతి తెలిసిందే. అంతేకాదు పీవోకే దానంతట అదే తిరిగి భారత్‌లో చేరుతుందని కూడా ఆయన అన్నారు. పీవోకే ప్రజలు భారత్‌లో కలిసేందుకు ముందుకు రావాలని కూడా ఓ సందర్భంలో రాజ్‌నాథ్ పిలుపునిచ్చారు. పాకిస్థాన్ మాదిరిగా తాము వారిని విదేశీయుల్లా కాకుండా, సొంత మనుషుల్లా పరిగణిస్తున్నామని పేర్కొన్నారు.

**సీఏఏ ఆవశ్యకత**

ఇక, పొరుగు దేశాల్లో హింసను ఎదుర్కొంటున్న మైనారిటీ వర్గాలను రక్షించడానికి పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ) ఎంతో ఆవశ్యకమని రాజ్‌నాథ్ పేర్కొన్నారు. హిందూ సమాజాన్ని గత ప్రభుత్వాలు విస్మరించాయని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ వారి బాధను అర్థం చేసుకున్నారని తెలిపారు. అందుకే సీఏఏను తీసుకువచ్చామని ఆయన వివరించారు. "పొరుగు దేశాల్లోని మైనారిటీ వర్గాలు చాలా ఏళ్లుగా బాధపడుతున్నారు. ముష్కరులు, దుండగులు వారి ఇళ్లను తగలబెట్టారు, వారి పిల్లలను చంపారు. వారి కుమార్తెలపై క్రూరత్వం ప్రదర్శించి, చిత్రహింసలు పెట్టారు. హిందూ ప్రజలను బలవంతంగా మతం మార్చారు. వారిలో చాలా మంది ఎలాగోలా తప్పించుకుని భారతదేశానికి వచ్చినప్పుడు, బుజ్జగింపు రాజకీయాలు చేసే ప్రభుత్వాలు, వారిపట్ల చూపిన కాఠిన్యాన్ని గురించి చెప్పడానికి మాటలు చాలవు" అని రాజ్‌నాథ్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు.

సీఏఏ- 2019 వల్ల పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ నుంచి వలస వచ్చిన హిందూ, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ, క్రైస్తవులకు భారత పౌరసత్వం కల్పించడానికి వీలు కలుగుతుంది. ఈ చట్టం 2020 జనవరి 10 నుంచి అమల్లోకి వచ్చింది. 2014 డిసెంబర్ 31న లేదా అంతకు ముందు భారతదేశంలోకి ప్రవేశించిన వారు ఈ చట్టం కింద భారత పౌరసత్వం పొందడానికి అర్హులు.

# ఆయుధాలు వదిలేస్తాం - మాకు అప్పటి వరకు సమయమివ్వండి : మావోయిస్టుల లేఖ

తెలిపారు. ఈ మేరకు ఆ 3 రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ (ఎంఎంసీ) స్పెషల్ జోనల్ కమిటీ అధికార ప్రతినిధి అనంత్ పేరిట బహిరంగ లేఖ విడుదల అయింది. ఫిబ్రవరి 15 వరకు సమయం ఇవ్వాలి : దేశం, ప్రపంచంలో మారుతున్న పరిస్థితులను అంచనా వేస్తూ, ఆయుధాలు త్యజించడం ద్వారా సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని తమ పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సోను దాదా ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తాము సమర్థిస్తున్నామని ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర కమిటీ సభ్యులు చంద్రన్న, సతీశ్ దాదా ఇటీవల ఈ నిర్ణయాన్ని సమర్థించారని తెలిపారు. ఎంఎంసీ స్పెషల్ జోనల్ కమిటీ సైతం తుపాకులను వదిలేయాలని భావిస్తోందని, అయితే 3 రాష్ట్రాల ప్రభుత్వాలు తమకు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 వరకు టైం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నామని అన్నారు.

**ఇతర ఉద్దేశాలేమీ లేవు :** ప్రజాస్వామ్య కేంద్రీకరణ సూత్రాలకు తమ పార్టీ కట్టుబడి ఉన్నందున ఈ నిర్ణయాన్ని సమష్టిగా చేరుకునేందుకు తమకు కొంత టైం పడుతుందని తెలిపారు. తమ సహచరులను సంప్రదించి, పద్ధతి ప్రకారం వారికి ఈ సందేశాలు తెలియజేసేందుకు టైం కావాలని కోరారు. ఇంత టైం అడిగేందుకు ఇతర ఉద్దేశాలేమీ లేవని వెల్లడించారు. త్వరగా కమ్యూనికేట్ చేసేందుకు తమకు వేరే సులభ మార్గాలు లేనందున ఈ వ్యవధిని కోరుతున్నామని, భద్రతా బలగాలు తమ కార్యకలాపాలు నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. పీఎల్‌జీఏ వారోత్సవాన్ని నిర్వహించబోమని, తమ అన్ని కార్యకలాపాలను నిలిపివేస్తామని హామీ ఇస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

**లొంగిపోయిన వారికి ఎలాంటి వేధింపులు ఉండవు :** ఈ నెల 22న అజ్ఞాతంలో ఉన్న 37 మంది మావోయిస్టులు లొంగిపోయారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులను మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. వారిలో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యుల్లో తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నారాయణ అలియాస్ రమేశ్, మరో రాష్ట్ర కమిటీ సభ్యుడు సోమ్‌దా అలియాస్ ఎర్ర కూడా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అజ్ఞాతంలో ఉన్నవారు ఎంత త్వరగా బయటకు వస్తే అంత మంచిదని అన్నారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు, రాజకీయ నాయకులు, మీడియా ఇలా ఎవరి ద్వారా అయినా మావోయిస్టులు బయటికి రావచ్చని తెలిపారు. మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని సీఎం రేవంత్ రెడ్డి కూడా పిలుపునిచ్చారని గుర్తు చేశారు.

## ఆయోధ్య రామమందిర నిర్మాణం సంపూర్ణం-
# ధ్వజారోహణానికి అంతా సిద్ధం!

అయోధ్యలో మరో అద్భుత ఘట్టం ఆవిష్కృతం కానుంది. దశాబ్దాలుగా వేచి చూస్తున్న రామాలయం ధ్వజారోహణం మంగళవారం జరగనుంది. ధ్వజారోహణం కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, ఆలయం పూర్తైందని ప్రపంచానికి చాటి చెప్పే కార్యక్రమమని శ్రీ రామ జన్మ భూమి ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఇప్పుడు రాముడితో పాటు హనుమాన్, సీత సహా ఆయన కుటుంబం సైతం మొదటి అంతస్థులో ప్రతిష్ఠాపన జరగనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అతిథుల్లో వీఐపీలు మాత్రమే ఉండరని, వివిధ వర్గాలకు చెందిన భక్తులు ఉంటారని చెప్పారు. ఇప్పటి రకు ఆహ్వానించని వారిని ముఖ్యంగా రాముడికి సాయం అందించిన వర్గాలకు సంబంధించిన వారిని పిలుస్తున్నట్లు పేర్కొన్నారు. 2025 డిసెంబర్ నాటికి ఆలయం మినహా మిగిలిన నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్లు స్పష్టం చేశారు. అయోధ్య రామ్‌లల్లా ఆలయ 191 అడుగుల శిఖరంపైన ప్రతిష్ఠించిన కాషాయ ధ్వజాన్ని ప్రధాని మోదీ ఎగరవేయనున్నారు. ఈ వేడుకకు సంబంధించిన సన్నాహాలు పూర్తయ్యాయి. రామ్‌లల్లా ఆలయంపై ఎగరనున్న కాషాయ ధ్వజం త్రిభుజాకారంలో ఉండనుంది. ఈ జెండాపై రాముడి తేజస్సు, శౌర్యం సూచించేలా సూర్యుడు, కోవిదర చెట్టు, ఓం చిహ్నాలు ఉండనున్నాయని ప్రధానమంత్రి కార్యాలయం తెలిపింది. గౌరవం, ఐక్యతను కాషాయ రంగు ప్రతిబింబించనున్నట్టు వెల్లడించింది. ఈ వేడుక కోసం సుమారు 100 టన్నుల రకరకాల పూలతో ఆలయాన్ని, నగరంలోని మార్గాలను అలంకరించారు. దాదాపు 7 వేల మంది ప్రత్యేక అతిథులు ఈ అపూర్వ ఘట్టానికి హాజరవుతారని రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. ఇప్పటికే పలువురు ప్రముఖులు అక్కడికి చేరుకోగా భక్తులు భారీగా తరలివెళ్తున్నారు. ధ్వజారోహణంతో పాటు గర్భగుడిలోని రామ్ లల్లా, అన్నపూర్ణ మందిర్‌ను దర్శించి పూజలు చేయనున్నారు ప్రధాని మోదీ. ఇంకా అయోధ్య పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సప్త మందిరాలను దర్శించనున్నారు. ఇందులో మహర్షి వశిష్ఠ, మహర్షి విశ్వామిత్ర, మహర్షి ఆగస్త్య, మహర్షి వాల్మీకి, దేవి అహిల్య, నిశాద్‌రాజ్ గుహ, మాతా శబరి, శేషావతార్ మందిరాలను సందర్శించనున్నారు. "శ్రీరాముడి జన్మస్థలంలో ఆలయం పూర్తైందని చెప్పుకునే క్షణం ఇది. పవిత్రమైన మంగళవారం రోజున ధ్వజారోహణం జరగనుంది. ప్రధానమంత్రి మోదీ, సీఎం యోగి ఆదిత్యనాథ్ జెండాను ఎగరవేయనున్నారు. బలమైన ముహూర్త సమయం కోసం వెతికి నవంబర్ 25న నిర్ధరించాం. ఈరోజున వివాహ పంచమి వస్తుంది. మన మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడు, సీతామాత వివాహం ఈ రోజునే జరిగింది." గోవింద్ దేవ్ గిరి మహారాజ్, శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ కోశాధికారి 2024 జనవరి 22న జరిగిన రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ వేడుకతో పోల్చితే ఈసారి అతిథుల సంఖ్యను తగ్గించినట్టు రామాలయ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్‌రాయ్ తెలిపారు. ఈ అద్భుత ఘట్టానికి ఆహ్వానితుల్లో 500 మందికిపైగా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సాధవులు ఉన్నట్టు వెల్లడించారు.

# తమిళనాడు, ఉత్తరాఖండ్‌లో బస్సు ప్రమాదాలు

ఢీకొట్టింది. స్పాట్‌లో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు మరణించగా, మరొకరు చికిత్స పొందుతూ మరణించారు. మరో 30 మందికి పైగా గాయపడ్డారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ప్రమాదం ధాటికి రెండు బస్సులు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని చికిత్స కోసం తెన్‌కాశీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తెన్‌కాశి జిల్లా కలెక్టర్ కమల్ కిశోర్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అరవింద్ నేతృత్వంలోని పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాద తీవ్రతను పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బస్సును ప్రమాద స్థలం నుంచి తొలగించే పనులు చేపట్టారు.

**స్పందించిన సీఎం**

మరోవైపు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఈ ఘటనపై స్పందించారు. ప్రమాదంలో ఏడుగురు మృతి చెందడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.3 లక్షలు, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి రూ.1లక్ష, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున ప్రకటించారు.

**నియంత్రణ కోల్పోయి గుంతలో పడిన బస్సు- ఐదుగురు మృతి**

ఉత్తరాఖండ్‌లోని తెహ్రీ జిల్లాలో బస్సు ప్రమాదం జరిగింది. భక్తులతో వెళ్తున్న బస్సు అదుపుతప్పి గుంటలో పడిపోయింది. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా, 20 మంది గాయపడ్డారని ఏఎస్పీ జేఆర్ జోషి తెహ్రీ గర్వాల్ తెలిపారు. క్షతగాత్రుల్లో కొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసుల ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. 28 మంది ప్రయాణికులతో ఉన్న బస్సు సోమవారం రిషికేశ్ నుంచి కుంజాపురి ఆలయానికి చేరుకుంది. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో బస్సు 70 మీటర్ల లోతు ఉన్న గుంటలో పడిపోయినట్లు సమాచారం. ఘటనాస్థలిలో ఎస్టీఆర్ఎఫ్ బృందాలు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యాయి. కాగా ప్రయాణికులంతా దిల్లీ, గుజరాత్‌కు చెందినవారుగా తెలుస్తోంది.

**ప్రమాదంపై స్పందించిన ఉత్తరాఖండ్ సీఎం**

ఈ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీ స్పందించారు. 'తెహ్రీలోని కుంజపురి ఆలయం సమీపంలో జరిగిన బస్సు ప్రమాదం వార్త చాలా బాధాకరం. మరణించిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ విషయంపై స్థానిక అధికారులతో ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నాను' అన్నారు.

# పుచ్చ లేచిపోద్ది: మాజీ మంత్రి నిరంజన్ రెడ్డికి కవిత స్ట్రాంగ్ వార్నింగ్

మాజీ మంత్రి నిరంజన్ రెడ్డిపై తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తనను ఉద్దేశించి "పుచ్చువంకాయ, సచ్చు వంకాయ" అంటూ అవమానకరంగా మాట్లాడుతున్నారని, మరోసారి ఇలా పిచ్చిగా మాట్లాడితే "పుచ్చ లేచిపోతుంది" అని ఘాటుగా హెచ్చరించారు. తండ్రి వయసు వారన్న గౌరవంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్నానని, ఇకపై సహించేది లేదని స్పష్టం చేశారు. 'జాగృతి జనం బాట' కార్యక్రమంలో భాగంగా వనపర్తిలో మీడియాతో మాట్లాడిన కవిత, నిరంజన్ రెడ్డిపై సంచలన అవినీతి ఆరోపణలు చేశారు. ఒక్కసారి మంత్రి అయిన నిరంజన్ రెడ్డి మూడు ఫామ్‌హౌస్‌లు ఎలా కట్టుకున్నారని ప్రశ్నించారు. అందులో అసైన్డ్ భూములు కూడా ఉన్నాయని ఆరోపించారు. కృష్ణా నది కాలువ సైతం ఆయన ఫామ్‌హౌస్ నుంచే వెళ్లేలా మళ్లించుకున్నారని స్థానికులు చెబుతున్నారని అన్నారు.

ఈ అవినీతి వ్యవహారాలు కేసీఆర్‌కు తెలియవా? లేక హరీశ్ రావు అడ్డుపడి కేసీఆర్ దృష్టికి వెళ్లకుండా కాపాడారా? అని కవిత నిలదీశారు. నిరంజన్ రెడ్డి అవినీతిపై ఇక్కడి చిన్న పిల్లాడిని అడిగినా చెబుతారని, మీడియా ముఖంగా ఈ విషయాన్ని కేసీఆర్ దృష్టికి తీసుకెళుతున్నానని తెలిపారు. అదే సమయంలో, నిరంజన్ రెడ్డి అవినీతిపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని కవిత ప్రశ్నించారు. హరీశ్ రావుకు సన్నిహితుడు కావడం వల్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను కాపాడుతోందని తాను బలంగా నమ్ముతున్నానని చెప్పారు. బీఆర్ఎస్‌తో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన కవిత, ఆ పార్టీలో ఉద్యమకారులు ఉండలేక సతమతమవుతున్నారని వ్యాఖ్యానించారు.

# 3, 4 రోజుల్లో సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ : సీఎం రేవంత్ రెడ్డి

నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. అభివృద్ధికి మద్దతుగా ఉండేవారిని సర్పంచ్‌లుగా ఎన్నుకోవాలి అని రేవంత్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతకు ముందు కొడంగల్ నియోజకవర్గానికి విచ్చేసిన రేవంత్ రెడ్డికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. "త్వరలో జరగబోయే సర్పంచ్ ఎన్నికలను అత్యంత కీలకం. మంచివాళ్లను సర్పంచ్ లగా ఎన్నికోండి. పదేళ్లు తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం ఉంటుంది. ఈ కొడంగల్‌ను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకుందాం.

ఈ ప్రాంతాన్ని దేశానికి ఆదర్శంగా నిలబెట్టుకుందాం. మన ఆర్థిక పరిస్థితిని బాగుచేయడానికి, అభివృద్ధి పథం వైపు నడిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకున్నది. దానికి ఒక ప్రయోగశాలగా కొడంగల్‌ను ఎన్నుకున్నాం. 16 నెలల్లో ఈ ప్రాంతాన్ని తెలంగాణ నోయిడాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు చేపడుతున్నాం"

– రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి

# రాజకీయ పార్టీలకు 'క్యాష్ డొనేషన్స్'పై పిటిషన్- కేంద్రం, ఈసీకి నోటీసు జారీ చేసిన సుప్రీంకోర్టు

లేకపోతే, అది ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛను దెబ్బతీస్తుందని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలు అయ్యింది. విరాళాలు ఇచ్చే దాతలు, వారి ఉద్దేశాలు ఓటర్లకు తెలియాలని, ఇలా జరగకపోతే వ్యక్తులు ఓటు వేసే విషయంలో హేతుబద్ధమైన, తెలివైన నిర్ణయం తీసుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. అంతేకాదు రాజకీయ పార్టీని నమోదు చేయడానికి, ఎన్నికల చిహ్నాన్ని కేటాయించడానికి ఏ రాజకీయ పార్టీ- నగదు రూపంలో విరాళాలు స్వీకరించకుండా షరతులు విధించాలని, ఇందుకోసం ఎలక్షన్ కమిషన్‌కు కూడా ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కోరారు. దీనితో నాలుగు వారాల తర్వాత దీనిని విచారణ చేస్తామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. అంతేకాదు దీనిపై ప్రతిస్పందించాలని కోరుతూ ఎన్నికల సంఘం, కేంద్రం, బీజేపీ, కాంగ్రెస్ లాంటి అనేక పార్టీలకు నోటీసులు జారీ చేసింది. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 13ఏ లోని క్లాజ్(డీ) రాజ్యాంగ విరుద్ధమని, దానిని కొట్టివేయాలని పిటిషనర్ కోరారు. అంతేకాదు సుప్రీంకోర్టు 2024లో ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేస్తూ ఇచ్చిన తీర్పును కూడా ప్రస్తావించారు.

**బహిర్గతం చేయాల్సిందే!**

రాజకీయ పార్టీలు విరాళాలు సేకరించేటప్పుడు, డొనేషన్స్ ఇచ్చే వారి పేర్లు, ఇతర వివరాలను కచ్చితంగా బహిర్గతం చేయాలి. అంతేకాదు విరాళాల సేకరణ విషయంలో పారదర్శకత కోసం, నగదు రూపంలో డొనేషన్స్ తీసుకోకుండా పార్టీలను ఆదేశించాలని పిటిషనర్ తరఫు న్యాయవాది జయేశ్ కె. ఉన్నికృష్ణన్ పేర్కొన్నారు. 'ఐటీ చట్టంలోని సెక్షన్ 13 ఏ ప్రకారం, రాజకీయ పార్టీలకు- సెక్యూరిటీలపై వచ్చే వడ్డీ, ఇంటి ఆస్తిపై, ఇతర వనరుల ద్వారా వచ్చే ఆదాయం, స్వచ్ఛంద విరాళాల ద్వారా వచ్చే ఆదాయాలకు ఇన్‌కమ్ ట్యాక్స్ లెక్కల నుంచి మినహాయింపు ఉంటుంది. దీని వల్ల పారదర్శకత లేకుండా పోతుందని' పిటిషనర్ పేర్కొన్నారు. అందుకే రాజకీయ పార్టీల ఖాతాలను స్వతంత్ర ఆడిటర్ల చేత ఆడిట్ చేయించేలా పోల్ ప్యానల్‌ను ఆదేశించాలని పిటిషనర్ సుప్రీంకోర్టును కోరారు. అంతేకాదు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 142, 143 కింద గత ఐదేళ్లుగా రాజకీయ పార్టీలు దాఖలు చేసిన ఐటీ రిటర్నులు, ఆడిట్ నివేదికలను పరిశీలించడానికి కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ)ని ఆదేశించాలని అన్నారు. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 29సీ ప్రకారం, ఐటీ చట్టం సెక్షన్ 13ఏ నిబంధనలు పాటించడంలో విఫలమైన రాజకీయ పార్టీలపై పన్ను, జరిమానా విధించడం సహా ప్రాసిక్యూషన్ ప్రారంభించేలా సీబీడీటీని ఆదేశించాలని కోరారు.

భారతదేశంలో నేడు డిజిటల్ చెల్లింపులు అసాధారణ రీతిలో పెరిగాయి. ముఖ్యంగా యూపీఐ చెల్లింపులు భారీ స్థాయిలో జరుగుతున్నాయి. అందువల్ల ఐటీ చట్టం, 1961లోని సెక్షన్ 13ఏ(డీ) కింద నగదు రూపంలో వచ్చిన ఆదాయాన్ని మినహాయించడాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ సమర్థించలేము అని పిటిషనర్ పేర్కొన్నారు.

# 53వ సీజేఐగా జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం- ప్రధాని, విదేశీ ప్రతినిధులు హాజరు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణస్వీకారం చేసిన జస్టిస్ సూర్యకాంత్ సుప్రీంకోర్టు 53వ ప్రధాన న్యాయమూర్తిగా (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయనతో ప్రమాణం చేయించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. సీజేఐగా బాధ్యతలు చేపడుతున్న తొలి హరియాణా వాసిగా జస్టిస్ సూర్యకాంత్ రికార్డు సృష్టించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీతో పాటు కేంద్రమంత్రులు, అలాగే విదేశీ న్యాయ ప్రతినిధులు కూడా హాజరయ్యారు. ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ బి.ఆర్.గవాయ్ పదవీకాలం ఆదివారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో 53వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సూర్యకాంత్ బాధ్యతలు స్వీకరించారు. 2027 ఫిబ్రవరి 9 వరకు దాదాపు 15 నెలలపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి రాధా కృష్ణన్, మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ దన్‌ఖడ్, ప్రధాని మోదీ, అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, జేపీ నడ్డా, రామ్మోహన్ నాయుడు, పీయూశ్ గోయల్ సహా పలువురు కేంద్రమంత్రులు, ఎన్‌డీఏలో కీలక నేతలు హాజరయ్యారు. నేపాల్, భూటాన్, శ్రీలంక, మారిషస్, కెన్యా, మలేసియా, బ్రెజిల్ నుంచి దాదాపు 15 మంది విదేశీ ప్రతినిధుల బృందాలు, వారి కుటుంబ సభ్యులు సైతం హాజరయ్యారు. వారిలో ప్రధాన న్యాయమూర్తులు కూడా ఉన్నారు. జస్టిస్ సూర్యకాంత్ 1962 ఫిబ్రవరి 10న హరియాణా హిస్సార్ జిల్లాలోని జన్మించారు. 1981లో అక్కడి ప్రభుత్వ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1984లో రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీ నుంచి న్యాయ శాస్త్ర పట్టా పొందారు. అదే ఏడాది హిస్సార్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా సాధన ప్రారంభించిన ఆయన 1985లో పంజాబ్ హరియాణా హైకోర్టుకు మారారు. 2001లో సీనియర్ న్యాయవాది హోదా పొందారు. 2004 జనవరి 9న పంజాబ్ హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనంతరం 2018లో హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, 2019లో సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. అలాగే 2024 నవంబరు 12 నుంచి సుప్రీంకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్నారు.

**కీలక తీర్పుల్లో భాగస్వామిగా జస్టిస్ సూర్యకాంత్..** దాదాపు రెండు దశాబ్దాల పాటు సేవలు అందించిన జస్టిస్ సూర్యకాంత్ కీలక తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. రాష్ట్ర అసెంబ్లీ బిల్లుల విషయంలో రాష్ట్రపతి, గవర్నర్ ఆలస్యంపై ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పులో కూడా జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో ఉన్నారు. బ్రిటీష్ కాలం నాటి దేశద్రోహ చట్టాన్ని నిలిపివేస్తూ ఇచ్చిన తీర్పులో భాగస్వామిగా ఉన్న ఆయన ఈ చట్టం కింద కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయవద్దని తీర్పులో ఆదేశించారు. వాక్‌స్వాతంత్ర్యం, అవినీతి, బిహార్ ఓటర్ల జాబితా, పర్యావరణం, లింగసమానత్వం వంటి అంశాల్లో ఆయన కీలక తీర్పులను వెలువరించారు. బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (%ూ×=%)లో భాగంగా ఈసీ తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల వివరాలను వెల్లడించాలని ఆదేశించిందిన ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. సుప్రీంకోర్టుతో పాటు అన్ని కోర్టుల బార్ అసోసియేషన్లలో మూడో వంతు సీట్లను మహిళలకు కేటాయించాలని ఆయన ఆదేశించారు. 'వన్ ర్యాంక్ వన్ పెన్షన్' (%ూ=ూ్రా%) పథకాన్ని ఆయన సమర్థిస్తూ, అది రాజ్యాంగపరంగా చెల్లుబాటు అవుతుందని తీర్పును ఇచ్చారు. ప్రస్తుతం శాశ్వత సర్వీసుల్లో మహిళా అధికారులను నియమించే పిటిషన్‌పైనా వాదనలను ఆయన వింటున్నారు. అలాగే 1976 అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మైనారటీ హోదాను పునఃసమీక్షించేందుకు మార్గాన్ని సుగమం చేస్తూ తీర్పు ఇచ్చిన ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు. పెగాసస్‌పై విచారణ జరిపిన కేసులోనూ సూర్యకాంత్ భాగస్వామిగా ఉన్నారు. రాష్ట్రపతి, గవర్నర్లు బిల్లుల ఆమోదంపై దాఖలైన పిటిషన్ల విచారణ ధర్మాసనంలో ఆయన ఉన్నారు. 2022లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పంజాబ్ పర్యటనలో జరిగిన భద్రతా లోపంపై దర్యాప్తు చేసేందుకు నియమించిన కమిటీలో జస్టిస్ సూర్యకాంత్ కూడా ఉన్నారు.

# బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర కన్నుమూత

బాలీవుడ్ ప్రముఖ నటుడు ధర్మేంద్ర (89) కన్నుమూశారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన నేడు తుదిశ్వాస విడిచారు. ఇటీవల ఆయన ముంబైలోని బ్రీచ్ కాండీ ఆసుపత్రిలో చికిత్స కూడా తీసుకున్నారు. డిశ్చార్జ్ అయ్యాక ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. 300కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన యాక్షన్ కింగ్‌గా, బాలీవుడ్ హీ-మ్యాన్‌గా గుర్తింపు పొందారు.

భారతీయ చిత్ర పరిశ్రమలో అత్యంత విజయవంతమైన నటులలో ధర్మేంద్ర ఒకరు. ఆరు దశాబ్దాలకు పైగా కెరీర్‌లో అనేక బ్లాక్‌బస్టర్ చిత్రాలు వచ్చాయి. ధర్మేంద్రకు ఇద్దరు భార్యలు కాగా, ఒకరు ప్రకాశ్ కౌర్, మరొకరు హేమమాలిని. ఆయనకు ఆరుగురు పిల్లలు ఉన్నారు. ఆయన సూపర్ హిట్ చిత్రాల్లో షోలే, ధరమ్ వీర్, సీతా ఔర్ గీతా, చుప్కే చుప్కే, గజబ్, దో దిశాయే, ఆంఖే, షికార్, ఆయా సావన్ ఝూమ్ కే, జీవన్ మృత్యు, మేరా గావ్ మేరా దేశ్, యాదోం కీ బారాత్ సహా మరెన్నో ఉన్నాయి. 1935 డిసెంబర్ 5వ తేదీన జన్మించిన ధర్మేంద్ర అసలు పేరు ధరమ్ సింగ్ డియోల్. సన్నీ డియోల్, బాబీ డియోల్, ఇషా డియోల్ ఆయన సంతానమే. 1960లో 'దిల్ బీ తేరా హమ్ బీ తేరా'తో ధర్మేంద్ర నటుడిగా చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆయన చివరి చిత్రం 'ఇక్కీస్' త్వరలో విడుదల కానుంది. చిత్ర పరిశ్రమకు ఆయన చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం 2012లో పద్మభూషణ్‌తో సత్కరించింది. ధర్మేంద్ర రాజకీయాల్లోనూ రాణించారు. 2004లో బికనీర్ నుంచి బీజేపీ ఎంపీగా గెలుపొందారు. బాలీవుడ్ 'హీ-మ్యాన్'గా కోట్లాది మంది అభిమానుల గుండెల్లో నిలిచిపోయిన దిగ్గజ నటుడు ధర్మేంద్ర అంత్యక్రియలు ముంబైలో ముగిశాయి. పవన్ హన్స్ శ్మశానవాటికలో ఆయన కుటుంబ సభ్యులు, సినీ పరిశ్రమ ప్రముఖుల అశ్రు నయనాల మధ్య అంతిమ సంస్కారాలు జరిగాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, సోమవారం ఉదయం 89 ఏళ్ల వయసులో తుది శ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో భారత సినీ పరిశ్రమ శోకసంద్రంలో మునిగిపోయింది. ధర్మేంద్రకు తుది వీడ్కోలు పలికేందుకు బాలీవుడ్ పరిశ్రమ కదిలివచ్చింది. అమితాబ్ బచ్చన్, ఆయన కుమారుడు అభిషేక్ బచ్చన్, ఆమిర్ ఖాన్ సహా పలువురు సీనియర్, జూనియర్ నటీనటులు, దర్శకులు, నిర్మాతలు శ్మశానవాటికకు చేరుకుని ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు.

దిన పత్రిక
# తొలి సమయం
మంగళవారం 25 నవంబర్ 2025

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించ వద్దు ఎస్సై



**తొలి సమయం శ్రీరంగాపూర్ నవంబర్ 24**
శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని వెంకటాపూర్ చౌరస్తా వద్ద ఎస్సై హిమబిందువు సోమవారం విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు.ఆటోలలో పరిమితికి మించి కూలీలను ఎక్కించరాదని ఆమె హెచ్చరించారు మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని ఆమె స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రామకృష్ణ.వాసు. మాసూమ్. పాల్గొన్నారు

## రిటైర్డ్ ఎంప్లాయ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (రెవ) జిల్లా అధ్యక్షులు సంక భద్రినారాయణ సౌజన్యం తో స్కూల్ గేట్ ప్రారంభం..




**తొలిసమయం, మహబూబాబాద్ నవంబర్23:**
రేబా జిల్లా అధ్యక్షులు సంత బద్రి నారాయణ ఆర్థిక సౌజన్యంతో మండల పరిషత్ బాలికల ప్రాథమిక పాఠశాల మహబూబాబాద్ చెందిన పాఠశాల నేమ్ బోర్డు మరియు ప్రధాన ద్వారానికి సంబంధించిన గేటు అమర్చి ప్రారంభించి దాతృత్వాన్ని చాటుకున్నారు, ఈ కార్యక్రమం నిర్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామోజీ నాయక్ మాట్లాడుతూ.. సంకబద్రి నారాయణ స్ఫూర్తిగా తీసుకొని ప్రభుత్వ స్కూళ్ల భలోపేతం లో భాగంగా దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు కిషన్, నాగముని,వరలక్ష్మి, లక్ష్మి,చామంతి, సృజన నవీన, మరియు పాఠశాల విద్యార్థిలు పాల్గొన్నారు,

## రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు, ఇల్లందు మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థుల ఎంపిక.



**తొలి సమయం, ఇల్లందు.నవంబర్, 24.** ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎస్జీఎఫ్ అండర్ 19 వెయిట్ లిఫ్టింగ్ ఎంపిక సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగింది. ఏం .వీరేంద్ర ,చరణ్ తేజ్ ,ఇల్లందు మైనారిటీ జూనియర్ కళాశాల లో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వెయిట్ లిఫ్టింగ్ లో మంచి ప్రతిభ చూపించి ఈనెల 25వ తేదీన హైదరాబాద్లో జరిగే రాష్ట్రస్థాయికి ఎంపిక అయ్యారు. విద్యార్థులను ఖమ్మం ఉమ్మడి జిల్లాల ఆర్ ఎల్ సి .అరుణకుమారి ,విజిలెన్స్ సీతారాములు ,ప్రిన్సిపాల్ ముదస్సర్, హుస్సేన్ లి , పిడి నజీముద్దీన్ ,సైదులు, అశోక్, సాదిక్, ప్రసాద్, ఉషారాణి, రజిని శిరీష, గౌస్ మహేశ్వరి , రేష్మ చిరంజీవి, తదితరులు అభినందించారు. ఎస్ జి ఎఫ్ సెక్రెటరీ మూస తదితరులు అభినందించారు.

## దీపం అంటుకొని ఇంట్లో వస్తువులు దగ్ధం అమ్మాపురంలో ఘటన



**తొలి సమయం తొర్రూర్ నవంబర్ 24**
దీపం అంటుకొని ఇంట్లో వస్తువులు దగ్ధం అయినా ఘటన తొర్రూర్ మండలం అమ్మాపురంలో సోమవారం జరిగింది.బేడ బుడగ జంగాల కాలనీకి చెందిన కడెం మల్లికంబ దేవుడికి పూజ చేస్తున్న క్రమంలో దీపం వెలిగించింది. ప్రమాదవశాత్తు దీపం అంటుకొని ఇంట్లోని నగదు,బట్టలు, కాగితాలు,బీరువా,బియ్యం వంటి విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి.వీటి విలువ సుమారు రూ. లక్ష వరకు ఉంటుందని బాధితురాలు తెలిపారు.ప్రభుత్వం తమ కుటుంబాన్ని ఆదుకోవాలని భాధిత మహిళ విజ్ఞప్తి చేస్తుంది

# మంగళవారంభద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక..







**ముఖ్య అతిదులుగా ఉమ్మడి ఖమ్మం-%భద్రాద్రి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులుపుట్ట శంకరయ్య...**

**తొలి సమయం, భద్రాద్రి కొత్తగూడెం నవంబర్ 23:** ఆదివారం స్థానిక పట్టణ పద్మశాలి సంఘం భవన్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి, ముఖ్య అతిదిగా ఉమ్మడి ఖమ్మం%-%భద్రాద్రి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు పుట్ట శంకరయ్య ఆధ్వర్యం లో విజయ వంతంగా ఎన్నిక జరిగిందిఎన్నికల పరిశీలకులుగా ఐత కిషన్, సంజీవ్, రిటర్నింగ్ ఆఫీసరుగా శ్రీ వి. మధుకర్ గారు, ఐటీడిఏ అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ కె. వెంకట నారాయణ , వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎన్నికైన నూతన కార్యవర్గం
అధ్యక్షులు: పి. వెంకటేశ్వర్లు
ఉపాధ్యక్షులు: ఎం.డి. బాబ్జి
కార్యదర్శి: వి.వి.జి. కృష్ణ
ట్రెజరర్: కణితి నరేష్

నూతన పదవుల్లో ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ, జిల్లాలో సైక్లింగ్ క్రీడాభివృద్ధి, క్రీడాకారుల పురోగతి కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

# చింతా రామనారాయణ మృతి సిపిఐ పార్టీకి తీరని లోటు..

**నేదునూరి జ్యోతి**
**సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు,**
**-మోతె లింగారెడ్డి**



**తొలి సమయం,వరంగల్ /హసన్పర్తి నవంబర్ 23:**
సమాజంలో అసమానతలు వివక్షత దోపిడి నశించాలని, భారత కమ్యూనిస్టు పార్టీ వరంగల్ తాలూకాలో నిరంతరం క్రియాశీల పోరాటాలు నిర్వహిస్తున్న సందర్భంలో, సిపిఐ పోరాటాలకు ప్రభావితమై, హసన్పర్తి మండలం జయగిరి గ్రామంలో చింతా రామనారాయణ 1980లో పార్టీలో చేరారు,పార్టీ నిర్వహించే కార్యక్రమాలలో క్రియాశీల నాయకునిగా పనిచేసారు, జయగిరి గ్రామంలో గౌడ సంఘ నాయకునిగా సిపిఐ పార్టీ నాయకులుగా, ఎదిగారు 1987 నుండి 1994 వరకు జయగిరి గ్రామ సర్పంచ్ గా గ్రామ ప్రజలకు నిస్వార్థంగా నిజాయితీగా సేవలందించారు మొదటి తరం కమ్యూనిస్టు నాయకులు కామ్రేడ్ చింత రామనారాయణ అని నేదునూరి జ్యోతి భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు మోతలింగారెడ్డి సిపిఐ సీనియర్ నాయకులు మాట్లాడుతూ తెలిపారు, ఆదివారం రోజున హసన్పర్తి మండలంలో జయగిరి గ్రామంలో చింత రామనారాయణ మృతి చెందారు, పార్టీ శ్రేణులు చింతా రామనారాయణ పార్థివదేహానికి ఎర్రగుడ్డ కప్పి పూలమాలవేసి నివాళు లర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 సంవత్సరాలుగా కమ్యూనిస్టు పార్టీలో కొనసాగుతూ పార్టీ పోరాటాలలో తన వంతు కృషిని కొనసాగించి మంచి పేరు తెచ్చుకున్న నీతి నిజాయితీ గల కామ్రేడ్ చింత రామనారాయణ అన్నారు మరణం కమ్యూనిస్టు పార్టీకి వారి కుటుంబానికి తీరనిలోటని పేర్కొన్నారు,చింతామణి మరణం పట్ల తీవ్ర సంతాపాన్ని తెలుపుతూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు చింతా రామనారాయణ అంత్యక్రియలలో సిపిఐ సీనియర్ నాయకులు రాజమౌళి మెట్టు శ్యాంసుందర్ రెడ్డి హసన్పర్తి మండల సిపిఐ కార్యదర్శి జయగిరి గ్రామ శాఖ సిపిఐ కార్యదర్శి గడ్డం చంద్రమౌళి సీతారామ నారాయణ కుమారులు స్వామి మధు సిహెచ్ తిరుపతి కూతురు స్వరూప భార్య శకుంతల పల్లె కుమారస్వామి కొంగంటి కుమారస్వామి మోటపోతుల రాజు తాళ్ల పెల్లి సాగర్ తాళ్ల పెల్లి చిరంజీవి పూజ రాజయ్య పిట్టల రవి తాళ్ల పెల్లి సదానందం యాటకాల కుమారస్వామి మల్లేశం బంధుమిత్రులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఐ టి డి ఎ క్రింది మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ భూమి పూజకు ముఖ్య అతిథిగా హాజరు ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య.

**ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య.**
**తొలిసమయం,ఇల్లందునవంబర్, 24.** అర్హులైన పేదలందరి సోంత ఇంటి కలను సాకరం చేయడమే ప్రజా ప్రభుత్వం సంకల్పం-ఎమ్మెల్యే కనకయ్య .అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందిస్తాం.ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిధారులకు త్వరితగతిన ఇల్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచన.
ఎమ్మెల్యే కి అపూర్వ స్వాగతం పలికిన గ్రామ ప్రాంతాల ప్రజానికం.ఇల్లందు మండలం లో ఐటీడీఏ క్రింద మంజూరైన ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిధారులభుమిపూజాకార్యక్రమానికిబొజ్జాయిగూడెం,సుది మళ్ళ,సుభాష్ నగర్,బాలాజీ నగర్ గ్రామాలలో ముఖ్య అతిధిగా హజరై, భూమి పూజ చేసిన ఇల్లందు నియోజకవర్గం శాసన సభ్యులు కోరం కనకయ్య.వారి వెంట ,ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,మండల మాజీ వైస్ ఎంపిపి మండల రాము,



మండల పార్టీ అధ్యక్షులు పులి సైదులు,సొసైటి చైర్మెన్ మెట్ల క్రిష్ణ,నాయకులు పూనెం సురేందర్,మాజీ సర్పంచులు కల్తీ పద్మ,పాయం స్వాతి,మహిళ మండల అధ్యక్షురాలు మోకాళ్ళ వెంకటమ్మ,,టౌన్ నాయకులు మడుగు సాంబమూర్తి,బోళ్ళ సూర్యం,చిల్లా శ్రీనివాస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా జన్మదిన వేడుకలు



**తొలి సమయం తొర్రూరు నవంబర్ 24**
తొర్రూర్ డివిజన్ ఇంచార్జ్, మహబూబాబాద్ జిల్లా నాయకులు మంద యాకమల్లు 39వ జన్మదినాన్ని పురస్కరించుకొని పట్టణ కేంద్రంలోని స్థానిక ఉర్దూ పాఠశాల విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లను ఉంచి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మంద. యాకమల్లు మాట్లాడుతూ 39వ జన్మదిన సందర్భంగా పట్టణంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థుల మధ్యన నా పుట్టినరోజును జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని పేర్కొంటూ పాఠశాల విద్యార్థులకు ఫ్రూట్స్ను ఇవ్వడం జరిగిందని అన్నారు. ఉమెన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు మంగళపల్లి హుస్సేన్ శాలువ తప్పి కేక్ కట్ చేసి ఆశీర్వదించడం జరిగినది

దిన పత్రిక
తొలి సమయం
మంగళవారం 25 నవంబర్ 2025

# మహాదానం.. మనమూ చేద్దాం!

మన రక్తం మనల్ని బతికిస్తుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఇతరుల జీవం నిలబెడుతుంది. రక్తం అమృతభాండం లాంటిది. పంచుకున్నకొద్దీ పెరుగుతుంది. ప్రమాదాల్లోనో, ప్రసూతి సమయంలోనో, శస్త్ర చికిత్సల కారణంగానో ఎవరికి రక్తం అవసరమైనా.. స్వచ్ఛందంగా అందిద్దాం. మన రక్తంలో మానవత్వం ప్రవహిస్తున్నదని నిరూపించుకుందాం శరీరంలోని వివిధ అవయవాలకు ప్రాణవాయువును చేరవేసే వాహకం.. రక్తం. మనిషికి శ్వాస ఎంత ముఖ్యమో, రక్తమూ అంతే ప్రధానం. శ్వాస ద్వారా మనం తీసుకున్న ప్రాణవాయువును ప్రధాన అవయవాలైన.. గుండె, మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలతో పాటు అన్ని అంతర్గత భాగాలకూ అందిస్తుంది రక్తం. రోడ్డు ప్రమాదాలు, ఇతర సంఘటనలు జరిగినప్పుడు రోగి శరీరంలోని రక్తం ధారాపాతంగా బయటికి పోతుంది. ఫలితంగా ఒంట్లోని రక్తం తగ్గిపోతుంది. మెదడు, గుండె తదితరాలకు రక్త సరఫరా నిలిచిపోవడంతో.. ఆక్సిజన్ కూడా అందదు. వివిధ అవయవాలు పనిచేయడం మానేస్తాయి.ఈ పరిస్థితుల్లో రోగి మరణించే ఆస్కారమూ ఉంది. కాబట్టే ప్రమాదాల్లో తీవ్ర రక్తస్రావానికి గురైనవారికి తక్షణం రక్తం ఎక్కిస్తారు వైద్యులు. మహిళల విషయానికొస్తే.. చాలా మందికి కాన్పుల సమయంలో రక్తస్రావం జరుగుతుంది.

అలాంటప్పుడు బయటి నుంచి రక్తం అవసరం అవుతుంది. గుండె, కాలేయం, కిడ్నీలు తదితర భాగాలకు శస్త్రచికిత్సలు జరిగినప్పుడు, ఇతర ఆపత్సమయాల్లోనూ రోగులకు రక్తం ఎక్కించాల్సిందే. ఆలస్యమైనకొద్దీ ప్రాణగండమే. ఈ క్రమంలోనే రక్తదానానికి ప్రాధాన్యం పెరిగింది. రక్తదాన ఆవశ్యకతను జనంలోకి తీసుకెళ్లి.. రక్తదాతలను ప్రోత్సహించే క్రమంలో ఏటా జూన్ 14ను 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం'గా జరుపుకొంటారు. ఎముక మజ్జ రక్తానికి జన్మస్థానం. తొమ్మిది రకాలు రక్తంలో ఎనిమిది ప్రధాన గ్రూపులతోపాటు, మరొక అరుదైన గ్రూపు కూడా ఉంది. ఆ ఎనిమిదిలో నాలుగు పాజిటివ్ అయితే, నాలుగు నెగెటివ్. సుమారు 90 శాతం మంది పాజిటివ్ గ్రూపులకు చెందిన రక్తాన్నే కలిగి ఉంటారు. అందులో ఎక్కువ మంది 'ఒ-పాజిటివ్' పరిధిలోకి వస్తారు. రెండో స్థానంలో 'ఎ-పాజిటివ్', మూడో స్థానంలో 'బి-పాజిటివ్', నాలుగో స్థానంలో 'ఎబి-పాజిటివ్' ఉంటారు. ఇవి కాకుండా.. ఎ-నెగెటివ్, బి-నెగెటివ్, ఎబి-నెగెటివ్, ఒ-నెగెటివ్ గ్రూపులూ ఉంటాయి. ఈ ఎనిమిదింటిలో 'ఎబి-నెగెటివ్' అరుదైంది. ప్రతి వెయ్యిమందిలో ఆరుగురికి మాత్రమే ఈ గ్రూపు రక్తం ఉంటుంది. ఇక, అన్నిటికంటే అపురూపమైంది 'బాంబే బ్లడ్ గ్రూప్'.



### అత్యవసర పరిస్థితుల్లో

ఒ-పాజిటివ్ రక్తాన్ని అత్యవసర పరిస్థితుల్లో పాజిటివ్ గ్రూప్‌కు చెందిన.. అంటే ఎ-పాజిటివ్, బి-పాజిటివ్, ఎబి-పాజిటివ్ వ్యక్తులకు ఎక్కించవచ్చు. కానీ, నెగెటివ్ గ్రూపులకు అంటే.. ఎ-నెగెటివ్, బి-నెగెటివ్, ఎబి-నెగెటివ్, ఒ-నెగెటివ్ గ్రూపుల వారికి అస్సలు ఎక్కించకూడదు. అలా చేస్తే ప్రాణాంతకం కూడా. ఒ-నెగెటివ్ రక్తాన్ని మాత్రం అన్నిరకాల పాజిటివ్, నెగెటివ్ గ్రూపుల రోగులకు ఎక్కించవచ్చు. అందుకే దీన్ని 'యూనివర్సల్ డోనర్' అని పిలుస్తారు.

### బాంబే బ్లడ్‌గ్రూప్

1952లో మొదటి సారిగా డాక్టర్ భేండే అనే వైద్యుడు.. ముంబైలో ఈ అరుదైన గ్రూపును గుర్తించారు. కాబట్టే, దీనికి బాంబే బ్లడ్‌గ్రూప్ అని పేరు పెట్టారు. పదివేల మందిలో ఒకరికి మాత్రమే ఈ తరహా రక్తం ఉంటుంది. బాంబే గ్రూపు వ్యక్తులకు ఆ గ్రూపునే ఎంచుకోవాలి. మరే ఇతర రకాన్నీ ఇచ్చేందుకు వీలులేదు.

### ఏం ఉంటాయి?

సాధారణంగా దాతల ద్వారా సేకరించిన రక్తం నుంచి రెండు రకాల ద్రవాలను, రెండు రకాల కణాలను తీస్తారు. అందులో ముఖ్యమైంది 'ప్యాక్డ్ రెడ్ బ్లడ్‌సెల్స్'. 'రెడ్ బ్లడ్‌సెల్స్' అనీ అంటారు. రక్తంలో ఎర్ర రక్తకణాలు, తెల్ల రక్తకణాలు, ప్లేట్‌లెట్స్, ప్లాస్మా.. అనే అనే నాలుగు ప్రధాన పదార్థాలు ఉంటాయి. వీటినే 'కాంపొనెంట్స్'గా వ్యవ హరిస్తారు. ఒక వ్యక్తి నుంచి సేకరించిన రక్తాన్ని ప్రత్యేక పద్ధతి ద్వారా వేరు చేస్తారు. ఆ ప్రక్రియలో ఎర్ర రక్తకణాలన్నీ అడుగు భాగానికి చేరుకుంటాయి. ప్లాస్మా పైకి తేలుతుంది. ప్లేట్‌లెట్స్ మధ్యభాగంలో ఉండిపోతాయి. వీటిని ప్రత్యేక పద్ధతి ద్వారా వేరుచేస్తారు. అవసరాన్ని బట్టి రోగులకు ఎర్ర రక్తకణాలు, ప్లాస్మా, ప్లేట్‌లెట్స్ ఎక్కిస్తారు.

### ఎర్ర రక్తకణాలు

ఎర్రరక్త కణాలున్న ద్రవాన్ని రెడ్ బ్లడ్‌సెల్స్(ఆర్‌బీసీ) అంటారు. ఎర్ర రక్తకణాలు శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను చేరవేస్తాయి. ఎర్ర రక్తకణాలను 43 రోజుల పాటు నిల్వ ఉంచవచ్చు. గుండె, కాలేయం, కిడ్నీ మార్పిడి వంటి శస్త్ర చికిత్సలు, కాన్పులు, ప్రమాదాల సమయంలో ఎక్కిస్తారు. పరిస్థితి తీవ్రతను బట్టి రక్తహీనత ఉన్న వారికి కూడా ఎర్ర రక్త కణాలను అందిస్తారు.

### ప్లేట్‌లెట్స్

ప్లేట్‌లెట్స్ రక్తస్రావాన్ని అరికడతాయి. శరీరం నుంచి ధారాపాతంగా కారిపోకుండా అడ్డుపడతాయి. శస్త్ర చికిత్సలు, రోడ్డు ప్రమాదాల్లో రోగికి తీవ్ర రక్తస్రావం జరిగినప్పుడు.. ఈ కణాలను ఎక్కిస్తారు. క్యాన్సర్, డెంగ్యూ వంటి విషజ్వరాలు ప్రబలినప్పుడు రోగి శరీరంలో ప్లేట్‌లెట్స్ తగ్గుతాయి. అప్పుడు కూడా ఈ కణాల అవసరం ఏర్పడుతుంది. ప్లేట్‌లెట్స్ కణాలను ఐదు రోజులు నిల్వ చేయవచ్చు.

### ప్లాస్మా ద్రవం

అగ్ని ప్రమాద బాధితులకు ఎక్కువగా ప్లాస్మా ఎక్కిస్తారు. ఇలాంటి సందర్భంలో ఒంటిమీది చర్మం కాలిపోయి మాంసం తేలుతుంది. రక్తంలోని ద్రవ పదార్థం ఆవిరైపోతుంది. ప్లాస్మాకు శరీరంలోని విష పదార్థాలను నిరోధించే శక్తి ఉంటుంది. కాలిన గాయాల వల్ల ప్లాస్మా ఆవిరైపోవడంతో శరీరంలో విషపదార్థాలు పేరుకుంటాయి. దీన్నే 'ఇన్‌ఫెక్షన్' అంటారు. ప్లాస్మా తగ్గేకొద్దీ ఇన్‌ఫెక్షన్స్ పెరిగిపోతాయి. ప్లాస్మాను నిర్దిష్ట ఉష్ణోగ్రతల వద్ద సంవత్సరం పాటు నిల్వ ఉంచవచ్చు. అగ్ని ప్రమాద బాధితులకు, దీర్ఘకాలిక కాలేయ వ్యాధిగ్రస్తులకు ప్లాస్మాను ఎక్కువగా వినియోగిస్తారు. అలాంటివారికి సంజీవినిలా పనిచేస్తుంది.

### రక్త దానానికి అర్హతలు

సాధారణంగా, రక్తదాన సమయంలో ఒక వ్యక్తి నుంచి 450 మిల్లీ లీటర్ల రక్తాన్ని సేకరిస్తారు. రక్తం సేకరించే ముందు దాతకు కొన్ని పరీక్షలు చేస్తారు. రక్తదానం చేసేవారికి కొన్ని అర్హతలు కూడా ఉండాలి. పద్దెనిమిదేండ్లు నిండాలి. అరవై ఏండ్లలోపు వారై ఉండాలి. మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతులై ఉండాలి 60 కిలోలకు పైగా బరువు కలిగి ఉండాలి.
రక్తపోటు సాధారణంగా ఉండాలి.రక్తంలో హిమోగ్లోబిన్ తగినంత ఉండాలి.చర్మవ్యాధులు ఉండకూడదు.హెచ్‌ఐవీ తదితర అంటువ్యాధులు ఉండకూడదు.రక్తదానం చేసిన సుమారు 21 రోజుల్లో శరీరం ఆ లోటును భర్తీ చేసుకుంటుంది.కాబట్టి, ఒకసారి రక్తదానం చేసినవారు, కనీసం మూడు మాసాల తరువాత మరో రక్తదానానికి సిద్ధం కావచ్చు. ఇంకో ప్రాణాన్ని నిలబెట్టడానికి సంసిద్ధత వ్యక్తం చేయవచ్చు. రక్తదానాన్ని మించిన మహాదానం లేదు. రక్తం ఇవ్వడం అంటే.. అమృతాన్ని ప్రసాదించడమే. అపోహలను, భయాలను వదిలిపెట్టి అర్హులంతా రక్తదానానికి ముందుకు రావాలి. కాకపోతే రక్తదానానికి వెళ్లేముందు కొన్ని జాగ్రత్తలూ అవసరం. ముందురోజు కంటినిండా నిద్రపోవాలి. రక్తదానానికి ముందు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. పుష్కలంగా మంచినీళ్లు తాగాలి. దీర్ఘకాలంగా ఏవైనా మందులు వాడుతుంటే.. ఆ విషయాన్ని తెలియజేయాలి.

### రక్తం తగ్గిపోతే..

రక్తం లేకపోతే మనిషి బతకలేదు. శరీరంలో ప్రవహించే రక్తం మెదడు, గుండెతో పాటు ఇతర అన్ని భాగాలకు ఆక్సిజన్ సరఫరా చేస్తుంది. రక్త ప్రసరణ తగ్గిపోయినా, సరఫరా నిలిచిపోయినా.. మెదడు పనిచేయడం మానేస్తుంది. రక్తహీనత వల్ల ముఖ్యంగా బీపీ పడిపోతుంది. అంటే రక్తప్రసరణ ప్రవాహ తీవ్రత తగ్గుతుంది. దీనివల్ల మెదడుకు ప్రాణవాయువు అందదు. దీంతో మెదడు చైతన్యహీనం అవుతుంది. 'బ్రెయిన్‌డెడ్' అంటే ఇదే. రక్త ప్రసరణ ఆగిపోతే మెదడు 3 నుంచి 5 నిమిషాలకు మించి పనిచేయదు. ఈ సమయం దాటితే నిర్జీవ స్థితికి చేరుకుంటుంది. రక్తహీనత వల్ల దెబ్బతినే రెండో ప్రధాన అవయవం గుండె. రక్తప్రసరణ ఆగిన 30 నుంచి 45 నిమిషాల వరకు మాత్రమే కనాకష్టంగా పనిచేస్తుంది. అంతకు మించితే శాశ్వతంగా ఆగిపోతుంది.


# ప్రతీరోజూ రాత్రి ఈ జాగ్రత్తలతో డయాబెటిస్ కంట్రోల్!!



డయాబెటిస్.. దీర్ఘకాలిక వ్యాధి. డయాబెటిస్ ను సకాలంలో నియంత్రించకపోతే అది హార్ట్ స్ట్రోక్ ను, బ్రెయిన్ స్ట్రోక్ ను కూడా కలిగిస్తుంది. సరైన ఆహారం తీసుకుంటూ, జీవనశైలి విధానాన్ని మార్చుకుంటే డయాబెటిస్ ప్రభావాన్ని కొంతమేరకు తగ్గించవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించాలి అనుకుంటే కచ్చితంగా తీసుకునే ఆహారంలో కార్బోహైడ్రేట్లను తగ్గించి, ప్రొటీన్లు పెంచుకోవాలి. మంచి ప్రోటీన్లు ఉన్న ఆహారాన్ని తీసుకుంటే డయాబెటిస్ కంట్రోల్ అవుతుంది. డయాబెటిస్ ను అదుపులో ఉంచుకోవడానికి రాత్రిపూట కొన్ని జాగ్రత్తలు పాటిస్తే మంచిదని నిపుణులు చెబుతున్నారు. డయాబెటిక్ బాధితులు రాత్రివేళ చిరుతిండ్లు తినకూడదు. డయాబెటిక్ బాధితులు రాత్రిపూట తక్కువ తినాలి. అది కూడా ఏడు గంటల లోపే డయాబెటిక్ బాధితులు భోజనం చేయడం మంచిదని సలహా ఇవ్వబడింది. రక్తంలో చక్కెర స్థాయిలు నిర్వహించడం కోసం డయాబెటిస్ బాధితులు ప్రతి రోజూ 7 నుండి 8 గంటల సేపు నిద్రపోవాలని సూచిస్తున్నారు. ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద రైలు ప్రమాదాలు ఇవే ఇక ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ఒక కప్పు చామంతి టీ తాగితే డయాబెటిస్ అదుపులోకి వస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇక నిద్రకు ముందు వాకింగ్ చేయడం కూడా డయాబెటిస్ బాధితులకు మేలు చేస్తుందని చెబుతున్నారు. ప్రతిరోజు రాత్రి పడుకునే ముందు ఏడు నుంచి ఎనిమిది పప్పులు నానబెట్టిన బాదం పప్పు తినడం వల్ల కూడా షుగర్ లెవెల్ అదుపులోకి వస్తుంది. అలాగే ప్రతిరోజు రాత్రి సమయంలో నానబెట్టిన మెంతుల నీళ్లు తాగుతూ, నానబెట్టిన మెంతులు తింటే కూడా డయాబెటిస్ కంట్రోల్ లో ఉంటుంది. మెంతులు హైపో గ్లైసీమిక్ లక్షణాలను కలిగి ఉంటాయి. అవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి. అలాగే రాత్రి భోజనం చేసిన తర్వాత మరియు పడుకునే ముందు 15 నిమిషాల పాటు వజ్రాసనంలో కూర్చుంటే రక్తంలో గ్లూకోజ్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. తిన్న ఆహారం ఈజీగా జీర్ణమవుతుంది. అందుకే డయాబెటిస్ ను కంట్రోల్ చేసుకోవాలనుకునే వారు రాత్రివేళల్లో ఈ చిన్న చిన్న చిట్కాలను పాటించాలని సూచిస్తున్నారు.

# ఈ పండ్లు తింటే వయస్సు గుర్తించలేనంత యవ్వనంగా.. నిత్య నూతనంగా..

మనలో చాలామంది సంవత్సరం గడుస్తున్న కొద్దీ వయసు మీద పడుతుందని తెగ బాధ పడుతూ ఉంటారు. వయసు కనపడనీయకుండా ఉండటంకోసం యాంటీ ఏజింగ్ క్రీములు, సీరమ్ లు వాడుతూ ఉంటారు. అయితే అవేవీ అవసరం లేకుండానే యాంటీ ఏజింగ్ ఫ్రూట్స్ ఆహారంలో భాగంగా చేసుకుంటే యవ్వనంగా, నిత్యనూతనంగా కనబడతారని, వయసు అసలు గుర్తుపట్టలేనంతగా యంగ్ గా మారతారని చెబుతున్నారు. వయసు కనబడనివ్వకుండా, అందాన్ని ఇనుమడింపజేసే ఆ పండ్లు ఏమిటో తెలుసుకుందాం. ఆరోగ్యాన్ని మరియు ఆరోగ్యకరమైన చర్మాన్ని కాపాడుకోవడానికి ఆహారంతోపాటు జీవనశైలి ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది. జీవనశైలిలో మార్పులతో పాటు ఆహారంలో కొన్ని యాంటీ ఏజింగ్ ఫ్రూట్స్ ను చేర్చుకుంటే యవ్వనంగా కనిపిస్తారు. ఇటీవల కాలంలో జరిగిన అతిపెద్ద రైలు ప్రమాదాలు ఇవే ఇక అటువంటి పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉన్న నారింజ పండు ఒకటి. దీనిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు మన చర్మ సంరక్షణ చేసి, చర్మం ముడతలు రాకుండా కాపాడతాయి. ఏజింగ్ సమస్యలు లేకుండా చేస్తాయి. వృద్ధాప్యాన్ని మరియు అనేక వ్యాధులను నిరోధించే ఫ్రీ రాడికల్స్ తో ఇవి పోరాడతాయి. తెలంగాణ ప్రజలను దగా చేశారు.. ఇక మన శరీరంలో కొలాజిన్ ఉత్పత్తిని పెంచి, శరీరాన్ని ముడతలు లేకుండా చేసి, యవ్వనంగా వుంచటంలో పుచ్చకాయలు దోహదం చేస్తాయి. పుచ్చకాయలు శరీరాన్ని హైడ్రేట్ గా కూడా ఉంచుతాయి . ద్రాక్ష పళ్లలో యాంటీ ఏజింగ్



లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మ కణాలు దెబ్బతినకుండా కాపాడతాయి. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి దోహదం చేస్తాయి. బొప్పాయి ఆరోగ్యానికే కాదు చర్మానికి ఎంతో మేలు చేస్తుంది . చర్మాన్ని హైడ్రేట్ గా ఉంచుతుంది . చర్మ కణాలు డ్యామేజ్ కాకుండా బొప్పాయి కాపాడుతుంది. బొప్పాయి కూడా ఏజింగ్ లక్షణాలను బయటకు రాకుండా చేస్తుంది. కివీ పండ్లు చర్మాన్ని మృదువుగా మెరుస్తూ ఉండేలా చేస్తాయి.
కోరమాండల్ రైలు ప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోడీ విచారం: హెల్ప్‌లైన్ నెంబర్లు కివీ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు విటమిన్ సి మరియు విటమిన్
ఈ చర్మ సౌందర్యాన్ని పెంచడానికి పనిచేస్తాయి. అవకాడోలో విటమిన్లు ఆరోగ్యకరమైన కొవ్వుల తో పాటు యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తినడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, చర్మం కూడా ఆరోగ్యంగా మారుతుందియాంటీఏజింగ్ బెనిఫిట్స్ ఇందులో ఉంటాయి.

# రెటినాల్ ఎంత మేలు?

చర్మ సంరక్షణలో రెటినాల్ ప్రాధాన్యం గురించి చాలా చెబుతుంటారు. అలాంటి క్రీమ్‌లు రాసుకోవచ్చా?

**ఓ పాఠకురాలు :** ప్రాథమికంగా ఇది విటమిన్-ఎలోని కొవ్వులో కరిగే పదార్థాల సమూహానికి చెందింది. కణాల పునరుద్ధరణలో ఉపయోగపడుతుంది. చర్మ సౌందర్యాన్ని రెట్టింపుచేసే సామర్థ్యం ఉంది. ఒంటికి నిగారింపునిచ్చి, అసలు వయసు కనబడకుండా చేస్తుంది. ముడతలు, మచ్చలు మొదలైన వాటిని వేగవంతంగా దూరం చేస్తుంది. క్రీమ్, సీరమ్ రూపంలో రెటినాల్ లభిస్తుంది. రోజు విడిచి రోజు కానీ, మూడురోజులకు ఒకసారి కానీ వాడొచ్చు. కాకపోతే కొందరికి రెటినాల్ పడదు. అలాంటివారు దూరంగా ఉండటమే మంచిది. పూసుకోగానే.. చర్మం కందిపోవడం, ఎర్రబారడం, నల్లబడిపోవడం, ఊడిపోవడం, దురద తదితర దుష్ప్రభావాలు కనిపిస్తాయి. వాడేముందు నిపుణులను సంప్రదించడం మంచిది. గర్భిణులు దూరంగా ఉండటం క్షేమం. మరీ ఎక్కువ కాలం వాడటం కూడా మంచిది కాదని అధ్యయనాలు చెబుతున్నాయి.



దిన పత్రిక
తొలి సమయం



# అయ్యో అనుపమ వేదాంతం మాట్లాడుతుందే!




తెలుగు తెర మీద మెరిసిన మలయాళీ బ్యూటీలలో అనుపమ పరమేశ్వరన్ కూడా ఒకరు. మలయాళంలో తెరకెక్కిన ప్రేమమ్ అనే సినిమా ద్వారా ఆమె హీరోయిన్ గా పరిచయమైంది. ఆ ఒక్క సినిమా అనుపమ పరమేశ్వరన్ కు సూపర్ క్రేజ్ తెచ్చి పెట్టింది. ఆ తర్వాత కోడి అనే సినిమాతో తమిళ సినీ పరిశ్రమకు ఎంట్రీ ఇచ్చి అక్కడ కూడా చాలా సినిమాల్లో నటించింది.
ఇక తెలుగులోను ప్రేమమ్ సినిమాలో నటించి ఒక్కసారిగా అందరి దృష్టిని తన వైపు తిప్పేసుకుంది. కాటుక కళ్ళు.. లంగా వోణీలో కనిపిస్తూ అందరినీ మైమరిపించింది. ప్రస్తుతానికి ఆమె తమిళంలో జయం రవి హీరోగా నటిస్తున్న సైరన్ అనే సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకి సంబంధించి ఒక ప్రెస్ మీట్ లో పాల్గొని పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంటూ వచ్చింది. ఈ క్రమంలోనే తన మనసుకు కష్టమైన విషయాలు బాధించే విషయాలను సాధ్యమైనంత త్వరగా మరిచిపోవడానికి ప్రయత్నిస్తానని ఆమె చెబుతోంది. తాను చాలా పాజిటివ్ గా ఉండే వ్యక్తినని చెబుతూనే తనకు ఏదైనా నచ్చకపోతే మొహం మీదే నిర్మొహమాటంగా చెప్పేస్తానని ఆ తర్వాత దాని గురించి మరిచిపోతానని ఆమె చెప్పుకోస్తోంది. ఇక జీవితం అనేది చాలా చిన్నదని చెప్పుకొచ్చిన అనుపమ పరమేశ్వరన్ ఈ లోకంలో ఎంత కాలం ఉంటామో తెలియదు వెళ్లే సమయం ఎప్పుడు వస్తుందో కూడా తెలియదు అంటూ వేదాంతం మాట్లాడుకొచ్చింది. జీవితంలో ఎదురైన ఆటంకాలు సమస్యలు మనసులో ఉంచుకుని మనలో శక్తిని వృధా చేసుకోరాదని ఆమె అభిప్రాయపడింది. ఎలా అయితే సీసీ కెమెరాలలో ఉన్న విజువల్స్ అన్ని నెల తర్వాత డిలీట్ అయిపోతాయో మన మనసును కూడా అలాగే ఉంచుకోవాలంటూ ఆమె ఒక ఆసక్తికరమైన సలహా ఇచ్చింది.
ఇక తెలుగులో ఆమె చివరిగా కార్తికేయ 2 అనే సినిమాతో హిట్టు అందుకుంది. ఆ తర్వాత బటర్ ఫ్లై అనే సినిమా చేసింది. కానీ ఆ సినిమా ఆమె కెరీర్ కి పెద్దగా కలిసి వచ్చేలా అయితే కనిపించలేదు. ఇక మరిన్ని సినిమా అవకాశాలు దక్కించుకునే ప్రయత్నాల్లో బిజీబిజీగా గడుపుతుంది అనుపమ.

# నజ్రియా ఇంట హైదరాబాద్ బిర్యానీ బెడిసి కొట్టిందా!



మాలీవుడ్ బ్యూటీ నజ్రియా నజీమ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. 'అంటే సుందరానికీ' సినిమాతో లాంచ్ అయిన అమ్మడు అటుపై మళ్లీ కనిపించలేదు. ఆ సినిమా వైఫల్యంతో అవకాశాలు రాలేదు. ఆమె కూడా ఇక్కడ జర్నీని అంత సీరియస్ గా తీసుకుని ప్రయత్నాలు చేయలేదు. మరి తాను సాంధించలేనిది భర్త ఫహాద్ ఫాజిల్ సాధిస్తున్నాడని అనుకుందో! ఏమో గానీ ఇక్కడ కెరీర్ వెరీ లైట్ అనేసింది. ఆ సంగతి పక్కనబెడితే!సుందరం రిలీజ్ సమయంలో అమ్మడు నెట్టింట ఏ రేంజ్లో హల్చల్ చేసిందో తెలిసిందే. హైదరాబాద్ సహా తెలుగింట రుచులన్నింటిని జుర్రేసి ఆహా..ఓహా అంటూ పొగిడేసింది. ముఖ్యంగా హైదరాబాద్ బిర్యానీ వరల్డ్ ఫేమస్ బిర్యానీ అంటూ సర్టిఫై చేసింది.నాన్ వెజ్ వంటకాలు అన్నింటిని సూపర్ అంటూ పొగిడేసింది. తన ఇంటి ఫుడ్ కూడా ఇంత టేస్ట్ గా ఉండదని ఒకేసారి అన్ని వంటకాలు లాగించేసింది. అప్పుడే అమ్మడు హైదరాబాద్ బిర్యానీ ప్రిపరేషన్ కూడా తెలుసుకుంది. బిర్యానీ ఎలా తయారు చేస్తారు. అందులో వాడే ఇంగ్రిడియన్స్ ఏంటి అంటూ ఓ చీటి రాసిపెట్టుకుంది. ఇంటికెళ్లిన తర్వాత ఓరోజు తప్పకుండా ట్రై చేస్తానని చెప్పింది. మరి ఆ ప్రయత్నం తాజాగా చేసిందా? అంటే చేసిందనే తెలుస్తుంది. వారం రోజుల క్రితమే అమ్మడు నైట్ డిన్నర్ లో భాగంగా హైదరాబాదీ బిర్యానీ వంటకం ట్రై చేసిందిట. ఇక్కడ స్టైల్ కి కావాల్సిన అన్ని రకాల పదార్థాలు సిద్దం చేసుకుని కొద్ది మోతాదు లో బిర్యానీ వండిందిట. దాదాపు మూడు గంటలు పాటు శ్రమించి బిర్యానీ సిద్దం చేసిందిట. కానీ టేస్ట్ బెడిసి కొట్టిందిట. హైదరాబాదీ బిర్యానీ టేస్ట్ ఏ మాత్రం రాలేదుట. ఆవిడ చేతి వంటకం ఆమెకే నచ్చలేదుట. మరి హబ్బీ ఫహాద్ ఫాజిల్ కి వడ్డించిందో ? లేదో?. ఇక అమ్మడి కెరీర్ సంగతి చూస్తే మాలీవుడ్ లో కూడా సినిమాలు చేస్తున్నట్లు లేదు.' అంటే సుందరానికీ' తర్వాత ఏ ప్రాజెక్ట్ కమిట్ అవ్వలేదు.

## బ్లాక్ డ్రెస్‌లో అదిరిపోయే
# పరువాల విందు



తమిళ్‌లో 'పోయి' అనే సినిమా తో 2005 సంవత్సరంలో సినిమా ఇండస్ట్రీకి పరిచయం అయిన ముద్దుగుమ్మ విమలా రామన్. ఈ అమ్మడి యొక్క సినీ కెరీర్ ఒడిదొడుకుల మధ్య సాగింది. 2009 లో మొదటి సారి 'ఎవరైనా ఎప్పుడైనా' సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టింది. ఆ సినిమా నిరాశ పర్చిన కూడా పలు సినిమాల్లో నటించే అవకాశం దక్కించుకుంది. మలయాళం లో సురేష్ గోపీ తో కలిసి టైమ్ అనే సినిమాలో నటించింది. సౌత్ లో అన్ని భాషల్లో నటించిన ముద్దుగుమ్మ ఈ మధ్య కాలంలో సినిమాలకు కాస్త దూరంగా ఉంటుంది. గత మూడు నాలుగు సంవత్సరాల నుండి సినిమాల్లో నటించని ఈమె మళ్లీ సినిమాల్లో రీ ఎంట్రీ ఇవ్వాలని ఆశ పడుతున్నట్లు ఉంది. అందుకే ఈ స్థాయిలో అందాల ఆరబోత చేస్తుంది. విమలా రామన్ ఈమధ్య కాలంలో సోషల్ మీడియాలో అందాల విందు చేస్తోంది. నాలుగు పదుల వయసులోనూ రెండు పదుల వయసు హీరోయిన్స్ తరహాలో స్కిన్ షో చేస్తూ అందాల ఆరబోత ఫోటోలను షేర్ చేయడం జరిగింది. తాజాగా మరోసారి బ్లాక్ డ్రెస్ లో ఇలా ఇన్ స్టాగ్రామ్ లో పరువాల విందు చేసింది. హీరోయిన్ గా ఈమె రీ ఎంట్రీ ఇవ్వాలని ఆశ పడుతుంది. కానీ ఈ వయసు లో తెలుగు లో ఆఫర్లు రావడం అనేది సాధ్యం కాకపోవచ్చు. కానీ కచ్చితంగా ఇండస్ట్రీలో ఈమె యొక్క అందాల జాతర అనేది ఓ రేంజ్ లో సోషల్ మీడియాలో జనాలను ఆకట్టుకోవడం ద్వారా ఐటెం సాంగ్స్ లో చేసే అవకాశాలు అయినా వస్తాయి. అంతే కాకుండా ఇతర భాషల్లో కీలక పాత్రల్లో నటించే అవకాశాలు ఉన్నాయని కొందరు చర్చించుకుంటున్నారు.

# ఐటెమ్ సాంగ్ కోసం హీరోయిన్ రెమ్యునరేషన్



బాలీవుడ్ ముద్దుగుమ్మ ఊర్వశీ రౌతేలాకి ప్రస్తుతం ఐటెం సాంగ్స్ కోసం మంచి గిరాకీ ఉంది. హిందీలో కూడా హీరోయిన్ గా కంటే ఎక్కువ ఐటెం గీతాలతోనే ఈ బ్యూటీ ఫేమస్ అయ్యింది. విశ్వ సుందరి కిరీటం సొంతం చేసుకున్న కూడా ఈ బ్యూటీని హీరోయిన్ గా తీసుకోవడానికి బాలీవుడ్ దర్శక నిర్మాతలు పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. దానికి ఆమె హైట్ కూడా ఒక కారణం అని చెప్పొచ్చు.
ఇదిలా ఉంటే సౌత్ లో కూడా ఐటెం సాంగ్స్ తో ఈ అమ్మడు మంచి జోరు చూపిస్తోంది. ఇప్పటికే మెగాస్టార్ వాల్తేర్ వీరయ్య సినిమాలో బాస్ పార్టీ సాంగ్ లో చిరంజీవితో స్టెప్పులు వేసింది. అలాగే రామ్ పోతినేని బోయపాటి కాంబినేషన్ లో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా సినిమాలో కూడా ఐటెం సాంగ్ చేసింది. ఇక అఖిల్ అక్కినేని ఏజెంట్ చిత్రంలో కూడా ఊర్వశీ రౌతేలా డాన్స్ లతో మురిపించింది. ఇక తెలుగులో ఐటెం సాంగ్ చేయడం కోసం మన నిర్మాతలు ఏకంగా ఈ బ్యూటీకి మూడు కోట్ల వరకు ఆఫర్ చేస్తున్నారంట. వాల్తేర్ వీరయ్యలో బాస్ పార్టీ కోసం ఒక స్టార్ ఇమేజ్ ఉన్న హీరోయిన్ కి ఇచ్చే స్థాయిలో రెమ్యునరేషన్ ఇవ్వడం షాకింగ్ అని చెప్పొచ్చు. తెలుగులో పూజా హెగ్డే రష్మిక మందన లాంటి స్టార్ హీరోయిన్స్ ఐదు కోట్ల వరకు చార్జ్ చేస్తున్నారు.అయితే ఊర్వశీ రౌతేలాకి 3 నిమిషాల పాట కోసం మూడు కోట్లు ఇవ్వడం ఆమెకున్న డిమాండ్ ని తెలియజేస్తోంది. ఇక పవన్ కళ్యాణ్ తేజ్ కాంబోలో సిద్ధం అవుతోన్న బ్రో అవతార్ మూవీ ఐటెం సాంగ్ కోసం కూడా ఆమె ఏకంగా మూడు కోట్లు డిమాండ్ చేస్తోందంట. ఈ అమ్మడు తాజాగా ట్విట్టర్ లో పవన్ కళ్యాణ్ ఖుషి మూవీ చూస్తున్న అని ట్వీట్ చేసింది. దీంతో బ్రో మూవీలో ఐటెం సాంగ్ చేస్తుందనే విషయాన్ని పరోక్షంగా రివీల్ చేసింది. గతంలో రామ్ పోతినేని సినిమాలో నటిస్తున్నప్పుడు కూడా ఆర్ అనే వర్డ్ ఉపయోగిస్తూ ట్విట్టర్ లో వైరల్ అయ్యింది. దానిని అందరూ అప్పట్లో రిషబ్ పంత్ గురించి పెడుతుందని అనుకున్నారు. తరువాత రామ్ పోతినేని గురించి మెన్షన్ చేసినట్లు క్లారిటీ ఇచ్చింది.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST : MANDAL DIST : MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101